క్లుప్తంగా

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెం, గన్నవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు పత్రాలను రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవరపల్లి విద్యాసాగర్ అందజేశారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

13న చండీహోమం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 13న అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 8.30 గంటలకు హోమం, పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఈనెల 11న శనివారం శనిత్రయోదశి పురస్కరించుకుని శనేశ్వరస్వామికి తైలాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ఈ పూజల్లో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

గన్నవరం: కార్తిక మాసం సందర్భంగా గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డీఎం పి. శివాజీ బుధవారం తెలిపారు. కార్తిక మాసంలో ప్రతి ఆదివారం, సోమవారం ఈ బస్సులు ఉదయం 3 గంటలకు గన్నవరం నుంచి బయలుదేరుతాయని చెప్పారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని పరమశివుడిని దర్శించుకుని అదే రోజు రాత్రికి గన్నవరం చేరుకుంటుందన్నారు. ఒక గ్రామం నుంచి 35 మంది భక్తులు బుక్ చేసుకుంటే అక్కడి నుంచే బస్సు బయలుదేరుతుందన్నారు. టికెట్ ధరలు సూపర్ లగ్జరీ బస్సుకు రూ. 1,150, అల్ట్రా డీలక్స్ బస్సుకు రూ. 1,100గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇతర సమాచారం కోసం 7382905633, 8790996090ను సంప్రదించాలని కోరారు.

217 ఉపాధి హామీ పనులు గుర్తింపు

ఉంగుటూరు: మండలంలో పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామ సభలు బుధవారం నిర్వహించారు. మానికొండ, నందమూరు, తరిగొప్పల, వేమండ గ్రామాల్లో గ్రామ సభలు ద్వారా 217 పనులు గుర్తించారని ఎన్ఆర్జీఎస్ ఏపీవో వినీల తెలిపారు. ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి



రామవరప్పాడు: సచివాలయ సిబ్బంది మరింత అంకిత భావంతో పని చేయాలని ఏపీఎస్ఐఆర్డీ డీపీఓ రాజ్యలక్ష్మి అన్నారు. ఏపీఎస్ఐఆర్డీ డైరెక్టర్ జె. మురళి ఆదేశానుసారం విజయవాడరూరల్ మండలం నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో బుధవారం సచివాలయ సిబ్బందితో సమావేశమై పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పరస్పర సహకారంతో పని చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందే విధంగా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పల ప్రత్యేక పూజలు

కంకిపాడు: స్థానిక శివాలయంలో అయ్యప్ప మాలధారులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఏకాదశి, బుధవారం సందర్భంగా శివాలయంలోని అయ్యప్ప స్వామి ఉపాలయంలో విశేష పూజలు జరిపించారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

వ్యాయామవిద్య అభ్యాసకులకు చేయూత

హనుమాన్‌జంక్షన్ రూరల్: వ్యాయామ విద్య అభ్యసిస్తున్న ఇద్దరు పేద విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చేయూతనందించింది. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన శ్యామల లక్ష్మీ ప్రసన్న, జొన్నాడ ధనలక్ష్మి ఇటీవల ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులో చేరారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా హాస్టల్, మెస్ చార్జీలు చెల్లించేందుకు వీరిద్దరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మానవత సంస్థను ఆశ్రయించటంతో వీరిద్దరికీ కోర్సు పూర్తి అయ్యే వరకు ప్రతి నెల వసతి, భోజన ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో శ్యామల లక్ష్మీ ప్రసన్న, జొన్నాడ ధనలక్ష్మిలకు చెరో రూ.5 వేలు చొప్పున బుధవారం మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ ప్రధాన కార్యదర్శి క్లోపల్లి నారాయణరావు, కోశాధికారి ప్రాబోలు గణేష్ పాల్గొన్నారు.

'వై ఏపీ నీడ్స్ జగన్'ను విజయవంతం చేయాలి



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు

కంకిపాడు: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. రామచంద్రరావు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి మండలంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 9న కంకిపాడు-1 సచివాలయం, 10న, కంకిపాడు-2, 14న కంకిపాడు-3, 15న కుందేరు, 16న నెప్పల్లి, 17న ప్రొద్దుటూరు, 20న పునాదిపాడు-1, 21న తెన్నేరు, 22న మద్దూరు, 23న కోలవెన్ను సచివాలయాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పాలన, గత టీడీపీ ప్రభుత్వ పాలనలో వైఫల్యాలపై ప్రజలను చైతన్యం చేస్తూ ఇంటింటి పర్యటన ఉంటుందన్నారు. అదే రోజు ఆ సచివాలయ పరిధిలో పార్టీ కార్యకర్త నివాసంలో ముఖ్య బాధ్యులు బస చేస్తారని వివరించారు. కంకిపాడు-1 పరిధిలో గురువారం సాయంత్రం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, డైరెక్టర్లు నకరికంటి శేఖర్, జొన్నలగడ్డ నాగేశ్వరరావు, జగన్నాథపురం సర్పంచ్ పిన్నబోయిన శ్రీనివాసరావు, పార్టీ నేత తంబాబత్తుల ఓంకారం పాల్గొన్నారు.

మంచి జరిగితేనే జగనన్నకు మద్దతివ్వండి..

ఉయ్యూరు: మంచి జరిగితేనే మద్దతు ఇవ్వాలని కోరిన ఏకైక దమ్మున్న నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చాంబర్‌లో మున్సిపల్‌చైర్మన్ వల్లభనేని నానితో కలిసి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సమావేశం బుధవారం నిర్వహించారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి మాట్లాడుతూ వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా నిర్దేశించాలన్నారు. గ్రామాల్లో, వార్డుల్లో పర్యటించి జగనన్న హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించి, ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించి, ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు.



మాట్లాడుతున్న రాజులపాటి, వల్లభనేని

టీడీపీ ఆరోపణలు అవాస్తవం..

మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) మాట్లాడుతూ ఉయ్యూరులో జరుగుతున్న అభివృద్ధి చూసి ఓర్వలేకే టీడీపీ అవాస్తవాలను ప్రచారం చేస్తోందన్నారు. గత మూడు రోజులుగా మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నాయకులు ప్రభుత్వంపై బురదచల్లుతున్నారని మండిపడ్డారు. అనుమతులు ఉన్న లే అవుట్‌లలోనే ప్రజల అవసరార్థం రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. టిడ్కో ఇళ్లు పేదలకు ఇవ్వటం ఇష్టం లేకే టీడీపీ రాద్ధాంతం చేస్తుందని ధ్వజమెత్తారు. ఉయ్యూరు పట్టణంలోని శ్రీలంక కాలనీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గురువారం ప్రారంభిస్తున్నామని చెప్పారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభిస్తున్నామని పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ దాసే రవి తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబు కలాం, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆయుర్వేదం.. మన సనాతన వైద్య విధానం



గూడవల్లిలో ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సునీత

గన్నవరం రూరల్: ఆయుర్వేదం భారతీయ సనాతన వైద్య విధానమని గూడవల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ కె.సునీత అన్నారు. బుధవారం మండలంలోని జక్కులనెక్కలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సర్పంచ్ మాకుల చిరంజీవి ప్రారంభించారు. ఈ శిబిరంలో 42మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కీళ్ల వాతం, గ్యాస్ ట్రబుల్, దగ్గు, జలుబు, చర్మ వ్యాధులు రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ సునీత మాట్లాడుతూ జీవన విధానం మార్పు ద్వారా రోగాలకు దూరంగా ఉండాలని చెప్పారు. యోగ సాధన, ఆహారం మార్పుల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. బయట లభించే ఆహార పదార్థాలు తినరాదని చెప్పారు. నూనె, కారం, మసాలాలు తగ్గించుకోవాలన్నారు. రోజూ గంటపాటు వ్యాయామం చేయటం మంచిదన్నారు. ప్రాథమిక దశలో ప్రభుత్వం అందించే వైద్య సేవలను వినియోగించుకోవటం ద్వారా ఆరోగ్యంతో జీవించాలని చెప్పారు. ప్రభుత్వం ఆయుష్ శాఖ ద్వారా ఉచితంగా మందులు, వైద్య సేవలు అందిస్తుందని వివరించారు. సిబ్బంది పుట్టా కోటేశ్వరరావు, డి.ప్రదీప్, సచివాలయం కార్యదర్శి బెజవాడ చైతన్య, రైతులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



రోగులకు మందులు అందజేస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు

పి.నైనవరం(విజయవాడరూరల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ కె.సువర్ణరాజు అన్నారు. బుధవారం పి.నైనవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పరిపాలనలో పేదలకు ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి వైద్యసేవలందించగా ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ గ్రామాన ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి ప్రముఖ వైద్యులతో మెరుగైన వైద్యసేవలను పేదప్రజలకు అందజేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సర్పంచి బట్టా సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు, డాక్టర్ మాధురీ, అధికారులు పాల్గొన్నారు. అనంతరం రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి



కానూరులో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రామారావు, వివిధ శాఖల అధికారులు

పెనమలూరు: మండల పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న బాణసంచా దుకాణాల ప్రాంగణాలను సీఐ టీవీవీ రామారావు, అగ్నిమాపక సిబ్బంది, ఇతర శాఖల అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామారావు వివరాలు తెలుపుతూ మండల పరిధిలో కానూరు, మురళీనగర్, పోరంకి, యనమలకుదురు, గోసాల ప్రాంతాల్లో మొత్తం 30 బాణా సంచా దుకాణాలు ఏర్పాటుకు వ్యాపారులు దరఖాస్తు చేశారన్నారు. బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంగణం పూర్తి భద్రతగా ఉండాలని సూచించారు. అన్ని అనుమతి పత్రాలతోనే దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధానంగా ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖ నుంచి నిర్దేశించిన విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్క వ్యాపారి నిబంధనలు విధిగా పాటించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాపులపాడు తహసీల్దార్‌గా సునీల్‌కుమార్



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు తహసీల్దార్‌గా డి.సునీల్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా బాపులపాడు తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండటంతో గన్నవరం తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ పి.రాజాబాబు ఉత్తర్వుల మేరకు ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న డి.సునీల్‌కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. నూతన తహసీల్దార్ సునీల్‌కుమార్‌ను కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా రేడియాలజీ దినోత్సవం

ఉయ్యూరు: వ్యాధి నిర్ధారణ వైద్య సేవలు అత్యంత కీలకమని లయన్స్ జిల్లా కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో రేడియాలజీ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ప్రముఖ రేడియాలజిస్ట్ ఎస్‌కే కరీంను సత్కరించారు. సాంబశివరావు మాట్లాడుతూ ఉయ్యూరులో తొలిసారిగా రేడియాలజిస్ట్ సేవలను అందుబాటులోకి తెచ్చి గ్రామీణులకు సేవలు అందిస్తుందన్న ఘనత కరీమ్‌దన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్తింటివారిపై కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు శ్రీహరి గార్డెన్స్‌కు చెందిన కె.లక్ష్మీదుర్గ ఎనిదేళ్ల క్రితం మాజీ ఆర్మీ ఉద్యోగి తాడేపల్లిగూడెంకు చెందిన మందలయ్యను పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. ప్రైవేటు సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. వీరికి బాబు ఉన్నాడు. అయితే గత 9 నెలలుగా భర్తతో పాటు ఆడపడుచులు సులోచన, వెంకటలక్ష్మిలు అదనపు కట్నం కోసం వేధించసాగారు. దీంతో బాధితురాలు పోలీసులు ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

నున్నలో డీపీఓ పర్యటన

నున్న(విజయవాడరూరల్): జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) జయచంద్రగాంధీ బుధవారం నున్న గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇంటిపన్నుల ద్వారా లైసెన్స్ ఫీజుల ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన రికార్డులను, వివిధ పనులకు సంబంధించి ఖర్చు చేసిన రికార్డులను ఆయన పరిశీలించారు. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం నుంచి, 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు, ఆ నిధులతో గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన రికార్డులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లింపులు, ఇతర చెల్లింపులకు సంబంధించిన వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ నుంచి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులపై ఆరా తీశారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏడీఏ, అధికారులు

గన్నవరం: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతుల నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎం. సునీల్ సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఆర్బీకే సిబ్బందికి, టెక్నికల్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు అవసరమైన గోనె సంచులను పౌరసరఫరాల శాఖ ద్వారా ఆర్బీకేలకు సరఫరా చేయనున్నట్లు వివరించారు. రైస్ మిల్లులకు ధాన్యం రవాణా చేసేందుకు ఏర్పాటు చేసిన ప్రతి వాహనానికి జీపీఎస్ పరికరాలను అమర్చినట్లు తెలిపారు. రైతులు తమ సొంత వాహనాలను వినియోగిస్తే మాత్రం తగిన రుసుము చెల్లించి జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం ధాన్యంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను గుర్తించే విధానాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి ఎస్ఎల్ తేజస్వి పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్ర'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనగాని

గన్నవరం: ప్రతిభవంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర నిర్వహణ ప్రణాళికపై అధికారులు, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సహకారంతో నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు తమ నైపుణ్యం చూపేందుకు వేదిక కానుందన్నారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ డిసెంబర్ రెండో వారంలో ప్రారంభంకానున్న ఈ పోటీల కోసం క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ పోటీల నిర్వహణ నిమిత్తం వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. ఎంపీడీఓలు ఈ. సత్యకుమార్, జీఎస్వీ శేషగిరిరావు, ఈఓపీఆర్డీ పి. వెంకటేశ్వరమ్మ, నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం

డీఈఓ తాహెరా సుల్తానా



మాట్లాడుతున్న డీఈఓ తాహెరా సుల్తానా

ఉయ్యూరు: విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో ఉయ్యూరు ఎడ్యుకేషనల్ డివిజన్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల సమావేశం బుధవారం నిర్వహించారు. డీఈఓ తాహెరా సుల్తానా మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యార్థుల విద్యా ప్రగతికి కృషి చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధి, నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యాచరణ ప్రణాళిక అమలులో శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో డీవైఈఓ పద్మారాణి, ఎంఈఓలు సుధారాణి, కనకమహాలక్ష్మి, ప్రసాద్, పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రహదారులు జలమయం



పోరంకి సెంటర్‌లో జాతీయ రహదారిపై నిలిచిన నీరు

పెనమలూరు: మండల పరిధిలో బుధవారం సాయంత్రం ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో జనజీవనానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. భారీ వర్షానికి తోడు పెద్ద శబ్దంతో ఉరుములు, మెరుపులు రావటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పాఠశాలలు, కాలేజీలు, వదిలే సమయంలో ఒక్కసారిగా వర్షం పడటంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీ వర్షం కారణంగా విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పూర్తిగా జలమయమైంది. కామయ్యతోపు, ఇంజినీరింగ్ కాలేజీ, తాడిగడప జంక్షన్, పోరంకి సెంటర్, పెనమలూరు సెంటర్‌లలో జాతీయ రహదారిపై మోకాలి లోతు వర్షం నీరు నిలిచి పోయింది. దీంతో జాతీయ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీగా ట్రాఫిక్ జామ్‌కావటంతో వాహనాలు ముందుకు కదలలేదు.

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామంలోని ఎస్సీల శ్మశానవాటికలో దట్టంగా చెట్లుపెరిగి సమాధి చేయడానికి ఇబ్బందిగా ఉందని స్థానికులు ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వంశీ ఆదేశాల మేరకు గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కో-కన్వీనర్ తోడేటి బెంజిమెన్ ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు. శ్మశానవాటికలో కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా శుభ్రం చేశారు.

కామయ్యతోపులో కమిషనర్ పర్యటన

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధి కామయ్యతోపులో కమిషనర్ ఎస్.ప్రకాశరావు బుధవారం పర్యటించారు. ఆయన డ్రెయినేజీలు పూడిక తీత తీస్తున్నారా లేదా తనిఖీ చేశారు. గంగానమ్మ గుడి వద్ద కుళాయి కావాలని స్థానికులు కోరటంతో వెంటనే కుళాయి ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్త సేకరణ సక్రమంగా జరుగుతుందా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నేతలు తుమ్మల వరదీష్, కటికల క్రిష్టోఫర్, కె.కోటేశ్వరరావు, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు

పెనమలూరు: అక్రమ ఇసుక రవాణా నివారణకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. పెదపులిపాక ఇసుక క్వారీలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో పెదపులిపాక క్వారీ మార్గంలో ఉన్న రోడ్డును తవ్వేశారు. తహసీల్దార్ వెంకటశివయ్య ఆదేశాల మేరకు వీఆర్వో దేవప్రియుడు పొక్లయినర్‌తో దారిని చెరిపేశారు. అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటశివయ్య హెచ్చరించారు.

కర్రసాముపై శిక్షణ

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం శిలంబం అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కర్రసాములో శిక్షణ ఇచ్చారు. అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి అలుగోలు నాగేశ్వరరావు నేతృత్వంలో కర్రసాములో తిప్పుడు వరుసల, దాడి, ప్రతిదాడి ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్రసాము విద్య అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు

పెనమలూరు: తండ్రి అదృశ్యంపై కుమార్తె ఫిర్యాదు చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎండీ దిల్షాద్‌బేగం తాడిగడప వసంతనగర్ కాలువ కట్టపై కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె తండ్రి ఎండీ మాకూబ్(65) కూడా ఆమెతోనే ఉంటున్నాడు. ఈ నెల 3వ తేదీన టిఫిన్ తిని వస్తానని ఇంటి నుంచి బయటకు వచ్చాడు. మరలా తిరిగి ఇంటికి రాలేదు. ఆయన కోసం కుటుంబ సభ్యులు వెతికినా అతని జాడ తెలియలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు

పెనమలూరు: తండ్రి అదృశ్యమయ్యాడని కుమారుడు ఫిర్యాదు చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన ఎండీ మస్తాన్ పెయింటర్‌గా పని చేస్తూ తల్లిదండ్రుల వద్దే ఉంటాడు.అయితే అతని తండ్రి మహ్మద్ అఫ్జల్ గత నెల 29వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్నాడని మందులు వాడుతున్నామని కుమారుడు తెలిపాడు. అనారోగ్యం కారణంగానే తన తండ్రి బయటకు వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పెనమలూరులో 2,464 మందికి రైతు భరోసా

పెనమలూరు: మండల పరిధిలో 2,464 మంది రైతులకు రైతుభరోసా ప్రభుత్వం అందజేసిందని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ తెలిపారు. ఆమె బుధవారం వివరాలు తెలుపుతూ మండలంలో 2వ464 మంది రైతులకు ప్రభుత్వం రెండో విడత రైతుభరోసా కింద రూ 55.64 లక్షల సొమ్ము మంజూరు చేసిందన్నారు. ఇందులో రైతులు 2,146 మందికి రూ. 42.92 లక్షలు, కౌలు రైతులు 318 మందికి రూ. 12.72 లక్షల చొప్పున సొమ్ము మంజూరు చేసిందన్నారు.